
సాక్షి
గుంటూరు
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025




గాయత్రీ మహాయజ్ఞం

ముప్పాళ్ల: మండలంలోని కుందురువారిపాలెం లో ఆదివారం శ్రీ సాందీపని ఆశ్రమ వార్షికోత్సవం, వసంత పంచమిని పురస్కరించుకొని 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 551.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,500 క్యూసెక్కులు వదిలారు.




సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతా నగరం వద్ద ఆదివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76, బ్యాంక్ కెనాల్‌కు 163 క్యూసెక్కులు వదిలారు.

రహదారులు రక్తసిక్తం

- కళ్లముందే ప్రాణాలు పోతున్నాయి
- జనవరిలోనే 30 మంది జిల్లాలో మృత్యువాత
- యువకులే అధికం
- ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువ

నిర్లక్ష్యం, అతి వేగమే ప్రధాన కారణం



పట్నంబజారు: కేవలం రెండు రోజుల వ్యవధిలో మూడు ప్రమాదాలు.. కళ్ల ముందే ఐదుగురు చనిపోయిన పరిస్థితులు జిల్లాలో ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ జనవరి ఒక్క నెలలోనే 30 మంది మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా బైక్ ప్రమాదాలే అధికంగా ఉంటున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం కారణంగానే తలపై తీవ్ర గాయాలతో మృత్యువాత పడుతున్నారు. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం తాగడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటం.. కారణం ఏదైనా నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఒక కుటుంబం ఇంటి పెద్దను కోల్పోతే, పరిణామం కన్నీటి పర్యంతరమే. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే, నిండు నూరేళ్లు జీవితంలో ఒడుదుడుకులే ఉండవన్న విషయాన్ని వాహనదారులు గుర్తించాలి.

నాలుగేళ్లలో పలు ప్రమాదాలు

అధిక శాతం ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులే మృత్యువాత పడుతున్నారని రవాణా అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. మృతి చెందిన ఘటనల్లో 45శాతానికి పైగా బైక్‌ల ప్రమాదాలు ఉంటున్నారు. ఇందులో 88శాతం పురుషులే మృతి చెందుతున్నారు. అధిక శాతం హైవే రోడ్లు మాత్రమే వినియోగిస్తున్నారని, సర్వీసు రోడ్లును సైతం ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందనే సూచిస్తున్నారు.

కేసులు నమోదు చేసినా ఫలితం శూన్యం

నిత్యం ట్రాఫిక్, ఆర్టీఏ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు రావటం లేదు. ఇప్పటికే కళాశాలలకు బైక్‌లు తీసుకుని రావద్దని పలు యాజమాన్యాలు విద్యార్థులకు చెప్పడంతో పాటు, తీసుకుని వచ్చిన వారిని లోపలికి రానివ్వకుండా అవగాహన కల్పిస్తున్నాయి. అయినప్పటికీ ఫలితం లేదు. ముఖ్యంగా మైనర్‌లు గుంటూరు నగరంతో పాటు, జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతూ, ఇతరులను కూడా ప్రమాదాల బారిన పడేస్తున్నారు. నిత్యం హెల్మెట్ పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నప్పటికీ, వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

జిల్లావ్యాప్తంగా ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	గాయాలు
2021	1047	431	913
2022	1071	397	1011
2023	972	352	912
2024	1042	442	1143
2025	25	30	70 (జనవరిలో)

ఒక్క జనవరిలోనే మృత్యు ఘంటికలు

- సరదాగా స్నేహితులతో కలిసి వెళ్లిన ఒక మైనర్ బాలుడు.. ట్రాక్టర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఏటుకూరు రోడ్డు బైపాస్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకుని ముగ్గురు మృత్యువాత పడ్డారు.
- ఓబులునాయుడు పాలెం వద్ద డీవైడర్‌ను ఢీకొట్టి ఒక వ్యక్తి మృతి చెందాడు.
- మైనర్ బాలుడు ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఘటనలో మరో మైనర్ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృత్యువాత పడిన సంఘటనలు హెల్మెట్ ధరించకపోవటం వల్లే జరిగాయి. రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం తాగడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో 18 ఏళ్ల నుండి 40 ఏళ్ల లోపు వారే అధికంగా మృతి చెందుతున్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచిస్తున్నాం. మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం వల్ల కూడా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి.

– కె. సీతారామిరెడ్డి (డీటీసీ, గుంటూరుజిల్లా)

ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతూనే ఉన్నాం



జిల్లాలో మైనర్‌లు, యువత, విద్యార్థుల ర్యాష్, త్రిపుల్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్‌లపై ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూనే ఉన్నాం. ముఖ్యంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రజల్లో మార్పు రావాలి. కేవలం పోలీసు ఉంటారని హెల్మెట్ పెట్టుకోవటం కాదు.. వారి ప్రాణరక్షణకు పెట్టుకోవాలి. తద్వారా ప్రమాదాలను అరికట్టగలం. మార్చి ఒకటో తేదీ నుంచి జరిమానాలు కూడా భారీగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎన్నో దుర్ఘటనలు నిలువరించిన వారవుతాం.

–ఎస్. సతీష్‌కుమార్ (ఎస్పీ, గుంటూరు జిల్లా)

పోలీసులమని భయపెట్టి ఆన్‌లైన్‌లో దోపిడీ

- రూ. 24లక్షలు పంపిన వృద్ధుడు
- నకిలీ అని తేలడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పట్నంబజారు: ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడే వ్యక్తి వద్ద నీ ఆధార్ ఉందని.. డబ్బులు కట్టకుంటే అరెస్ట్ చేస్తామని వాట్సాప్ కాల్ ద్వారా భయపెట్టడంతో వ్యక్తి ఏకంగా రూ 24లక్షలు వారికి పంపిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన వంకాయల నాగేశ్వరరావు (65) పురుగు మందుల వ్యాపారం చేసి ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో జనవరి 28న వాట్సాప్ ఫోన్ కాల్ వచ్చింది. తాను బెంగుళూరు పోలీసునని, పేరు శివప్రసాద్ అని, తాము ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపాడు. ఆ వ్యక్తి వాడుతున్న సిమ్‌కార్డు మీ పేరుతో ఉందని, దీంతో పాటు అతడు రూ. 30లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నాడని మాయమాటలు చెప్పాడు. ఆ డబ్బులు కట్టకుంటే అరెస్ట్ చేస్తామని నాగేశ్వరరావును భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో ఆయన భయపడి దఫాలు వారీగా తన బ్యాంకు అకౌంట్ల నుంచి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ. 24లక్షల పంపించాడు. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు ఇంకా డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తుండటంతో విషయాన్ని నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకుని వెళ్లాడు. దీంతో ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పట్నంబజారు: పట్టభద్రుల ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 3న జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేసిన విషయాన్ని ప్రజలు, ఫిర్యాదుదారులు, బాధితులు గమనించాలని ఆయన తెలియజేశారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకం, నక్షత్ర హారతి, సాయంత్రం ఆరు గంటలకు రక్షా బంధనం, మృత్సంగ్రహణ అంకురారోపణ, ఋత్విక్ వరణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఘనంగా ముగిసిందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

తాడేపల్లిలో ఎస్పీ విస్తృత పర్యటన

ముఖ్యమంత్రి భద్రత, జాగ్రత్తలపై తనిఖీలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లిలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి నివాసముంటున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులతో చర్చించారు. ఉండవల్లి నుంచి ఆత్మకూరు పార్టీ కార్యాలయం వరకు ముఖ్య కూడళ్లను పరిశీలించారు. ప్రకాశం బ్యారేజ్ బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద, కేఎల్‌రావు కాలనీ రోడ్డుకు ఇరువైపులా, సీతానగరం రేవేంద్రపాడు రహదారి, భరతమాత సెంటర్, ఓల్ట్ టోల్‌గేట్ వద్ద, పాతూరు అండర్‌పాస్ రహదారి, కుంచనపల్లి బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి తదితర ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటుతో పాటు ముఖ్యమంత్రి ఆత్మకూరు పార్టీ కార్యాలయానికి వెళ్లే సమయంలో భారీ భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో క్రైం అడిషనల్ ఎస్పీ రవికుమార్, నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ నారాయణ పాల్గొన్నారు.

పానకాల స్వామి దీక్షలు ప్రారంభం




మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం మాలధారణ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు దీక్షధారులకు మాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి మండల దీక్షను, ఈనెల 22నుంచి అర్ధమండల, మార్చి 4 నుంచి ఏకాదశ మాల దీక్షలు ఉంటాయని వివరించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దీక్షధారులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు.

దుర్గమ్మకు రూ.10 లక్షల విలువైన బంగారు సూత్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు రూ.10 లక్షల విలువ కలిగిన బంగారు మంగళసూత్రాలు, తాడును ఆదివారం కానుకగా సమర్పించారు. విజయవాడ గుణదలకు చెందిన చింతలపట్టి మల్లికార్జునరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసిన దాతలు 120 గ్రాముల బంగారంతో తయారు చేసిన గొలుసు, రెండు మంగళ సూత్రాలను డీఈఓ రత్నరాజుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టాలు దూరం



విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్న కానుకమాత చర్చి

రెంటచింతల: నిండు విశ్వాసంతో క్రీస్తును ప్రార్థిస్తే కష్టాలు దూరం అవుతాయని కడప పీఠం అపోస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలి బాలి అన్నారు. ఏసు క్రీస్తును సమస్త మానవాళిని రక్షించుటకు యెహోవాకు కానుకగా కన్య మరియ సమర్పించిందని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ యేరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య, నల్గొండ పీఠం విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ గోవిందు జోజి, ఫాదర్లతో కలిసి కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవ సమష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఏసు ప్రభువులోని మహిమ, తేజస్సును విశ్వాస దృష్టితోనే చూడగలమన్నారు. కథోలికులు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ ఇతరులపై ప్రేమ, దయ, కరుణ చూపుతూ జీవించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలకు శాంతి సమాధానాలే పరిష్కార మార్గాలని తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన 74 మంది గురువులు, 53 మంది మఠకన్యలు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ గాలి బాలి, భాగ్యయ్య, గోవిందు జోజిలను ఘనంగా సన్మానించారు. సాయంత్రం 4 గంటల నుంచి కానుకమాతకు కొవ్వొత్తులను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున బందోబస్తు ఏర్పాటు చేశారు.



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న డాక్టర్ గాలిబాలి, చిన్నాబత్తిని భాగ్యయ్య, గోవిందు జోజి

పడగ దించిన కుష్ఠు వ్యాధి

- తగ్గుతున్న కేసులు
- ఎల్‌సీడీసీ సర్వేలో వెల్లడి
- తాజాగా 'స్పర్శ' ఆరంభం
- వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సుల నిర్వహణ

తెనాలి: కుష్ఠు వ్యాధి నిర్మూలనలో రాష్ట్రంలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. ఏటికేడాది విస్తరిస్తూ వస్తున్న వ్యాధి గత నాలుగేళ్లుగా తగ్గిపోతుండటం ఇందుకు నిదర్శనం. ఇదే క్రమంలో తెనాలి ప్రాంతంలోనూ వ్యాధి పీడితుల నమోదు తగ్గింది. కార్యాచరణను ఇలాగే కొనసాగిస్తే, నిర్మూలనకు అవకాశం ఉంటుందన్న ఆశాభావం కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (ఎల్‌సీడీసీ)లోనూ కేసుల సంఖ్య బాగా తక్కువగా కనిపిస్తోంది. తాజాగా మహాత్మాగాంధీ వర్ధంతి రోజైన గత నెల 30వ తేదీ నుంచి 'స్పర్శ' ఆరంభమైంది. ఇందులో భాగంగా వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సులతో పాటు సర్వే కూడా చేస్తారు.

జిల్లాలోనూ 800 కేసులు

2018 నాటికి దేశంలో కుష్ఠు వ్యాధిని నిర్మూలిస్తామని నాటి కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనకు భిన్నంగా వాస్తవ గణంకాలు వెలుగుచూశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలోనూ దాదాపు 800 పైచిలుకు వెలుగుచూశాయి. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వ్యాధిగ్రస్తుల సర్వేలో ప్రత్యేక యాప్‌తో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఏటా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. తాజాగా జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వేలోనూ కేసులు తగ్గుముఖం పట్టిన దాఖలాలు కనిపించాయి. తెనాలి యూనిట్ పరిధిలో (కొలకలూరు, ఈమని, దుగ్గిరాల, మున్నంగి పీహెచ్‌సీలు) 2022-23లో 27 కేసులు, 2023-24లో 28 కేసులు రాగా, 2024-25లో ఇప్పటివరకు కేవలం 25 కేసులే ఉన్నాయి. మరో 83 మందిని అనుమానితులుగా గుర్తించారు. వీరిని మరోసారి సంబంధిత అధికారులు పరీక్షించి వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స చేస్తారు. గజ్జి, తామర, సోబి, నల్లమంగు, విటమిన్ లోపంతో వచ్చే మచ్చలైతే అవసరమైతే మందులు ఇస్తామని డెప్యూటీ పారామెడికల్ అధికారి జె.శ్యామ్ వెల్లడించారు.



దుగ్గిరాలలో ఆశా వర్కర్ల సర్వే

బాక్టీరియా క్రిమి కారణం

'లెప్రే బ్రాసిలే' అనే బాక్టీరియా క్రిమి కారణంగా కుష్ఠు వ్యాధి సంక్రమిస్తుంది. క్షయ వ్యాధికారక క్రిమి కూడా ఈ తరహాకు చెందినదే. ఈ రెండింటినీ అక్కాచెల్లెళ్లుగా చెబుతుంటారు. క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశించాక, వ్యాధి బయటపడేందుకు, సంబంధిత మనిషిలోని రోగనిరోధక శక్తి ఆధారంగా ఐదు నుంచి 30 సంవత్సరాలు పట్టొచ్చు. శరీరంపై తెల్లమచ్చలతో వ్యాధి లక్షణాలు మొదలవుతాయి. చేతులు, కాలివేళ్లు, మూతివంకర్లు పోవడం నుంచి పుండ్లు ఏర్పడి, వేళ్లు కోల్పోవటం వరకు తీవ్రత ఉంటుంది. చివరకు అంగవైకల్యానికి దారితీస్తుంది.

అందుబాటులోకి ప్రత్యేక యాప్

జిల్లా కేంద్రంలో ఓ యూనిట్‌ను ఉంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేశారు. కుష్ఠు వ్యాధి కేసును ఇతర సంస్థలు గుర్తించినా, పీహెచ్‌సీకి అప్పగించాల్సిందే. దీంతోపాటు జాతీయ కుష్ఠునిర్మూలన కార్యక్రమం-ఏపీ పేరుతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను 2020లో అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్వేలో ముందుగా ఆఫ్‌లైన్‌లో చేసి, వివరాలను ఆన్‌లైన్ చేసేవారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ప్రత్యేక యాప్‌తో నేరుగా ఒకేసారి ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించడం మొదలుపెట్టారు. నేడు అదే విధానం కొనసాగుతోంది.

సంజీవనిలా ఎండీటీ చికిత్స

ప్రపంచ ఆరోగ్య సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 1980లో దేశ వ్యాప్తంగా కుష్ఠు నిర్మూలనను చేపట్టింది. మురికివాడలు సహా ఇంటింటి సర్వే చేసింది. లక్షణాలు కనిపిస్తే నమోదు చేసుకుని అక్కడే 'మోనోథెరపీ' అనే మందును ఇచ్చేవారు. దీని స్థానంలో 1986లో బహుళ మందుల చికిత్స (ఎండీటీ) విధానం సంజీవనిలా వచ్చింది. ప్రభుత్వ లెప్రసీ యూనిట్లు, మోరంపూడి వద్ద గల గ్రెటనాల్టస్ వంటి సంస్థలు ఇందులో చురుకుగా పనిచేశాయి. 2003 నాటికి వ్యాధి నిర్మూలన జరిగిందనీ, 10 వేలమందికి ఒకరు కూడా బాధితులు లేరనే భావనతో ప్రభుత్వం కార్యాచరణను తగ్గించింది.







శరవేగంగా మూడు వంతెనల పనులు

గుంటూరు నగరంలో మూడు వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబర్ 25న నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. దీంతో పట్టణ వాసులు అవస్థలు పడుతున్నారు. ఈనెల 10వ తేదీ లోపు పనులు పూర్తిచేయాలని నగర కమిషనర్ రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో పనులు ముమ్మరం చేశారు. ఆదివారం రైల్వే ట్రాక్ కింద సిమెంట్ దిమ్మెలను అమర్చే పనులు చేశారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, గుంటూరు.

క్లుప్తంగా

కాలువలోకి దూసుకెళ్లిన కారు



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు పంట కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని వేమవరం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రాజమండ్రికి చెందిన ఓ కుటుంబం కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తోంది. వేమవరం గ్రామ శివారులో రహదారి మార్జిన్ దిగడంతో అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. బెలూన్‌లు తెరుచుకోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదని కారు యజమాని పి.రాంబాబు తెలిపారు. మరో వాహన సాయంతో కారును రోడ్డు పైకి తెచ్చారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కానిస్టేబుల్ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా నుంచి ప్రకాశం జిల్లా దొనకొండకు వెళ్తున్న ఇన్నోవా కారు గతనెల 20వ తేదీన తెల్లవారుజామున అదుపుతప్పింది. యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద హైవేపై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన గిద్దలూరు నల్లబండ్ల బజారుకు చెందిన సింగిశెట్టి బాలఉగ్రకు తీవ్రంగా, వెనుక ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాలఉగ్రను 108లో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాలఉగ్ర ప్రకాశం జిల్లా దొనకొండ పోలీస్‌స్టేషన్‌లో 2011 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య మంజులాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యడ్లపాడు ఎస్‌ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

కాలువలోపడి యువకుడు ...

అచ్చంపేట: యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని వేల్పూరుకు చెందిన యువకుడు ఆవుల నాగేశ్వరరావు(34) సాయంత్రం 4 గంటల సమయంలో బైకుపై వేల్పూరు నుంచి క్రోసూరు వెళుతున్నాడు. మద్యం తాగి బైకు వేగంగా నడపడం వలనే రోడ్డుపక్కన ఉన్న కాలువలో పడినట్లు స్థానికులు చెబుతున్నారు. భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

శారదా కాలనీని జల్లెడ పట్టిన పోలీసులు

- అనుమానితులు, రౌడీషీటర్ల కట్టడికి కార్డన్ సెర్చ్ ఆపరేషన్
- హాజరైన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ, డీఎస్పీ



కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ క్రైమ్స్ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ సుప్రజ, అరండల్‌పేట సీఐ వీరాస్వామి

లక్ష్మీపురం: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ(క్రైమ్స్) ఓ.సుప్రజ, వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా కాలనీలోని కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 20వ లైను నుంచి 30వ లైన్ల వరకు పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు, వ్యక్తుల వివరాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిశీలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అడ్డుకట్టతో పాటు స్థానికులకు మనోధైర్యం కల్పించేందుకు కార్డన్ సెర్చ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. 20 మంది అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరించినట్లు చెప్పారు. సరైన పత్రాలు, అసలు పత్రాలే లేని 43 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. వాహనదారులు సరైన పత్రాలు సమర్పిస్తే వాటిని తిరిగి అప్పగిస్తామని తెలిపారు. భవిష్యత్తులో తెనాలి, మంగళగిరి, తాడేపల్లి వంటి పలు ప్రాంతాల్లో కూడా ఆపరేషన్ నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐపీఎస్ దీక్ష, సౌత్ డీఎస్పీ భానోదయ, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలి, ఒత్తిడులతో మానసిక రుగ్మతలు

- ప్రముఖ మానసిక వైద్యుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి
- ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ చదలవాడ కృష్ణయ్య చౌదరి స్మారక బంగారు పతకం స్వీకరణ



డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడికి బంగారు పతకం బహూకరిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్

తెనాలి: మనుషుల్లో కొందరు తమకు తెలియకుండానే ఎన్నో మానసిక రుగ్మతలతో బాధపడుతుంటారని, ముందుగా వాటిని పసిగట్టినట్టయితే చికిత్సను అందించి సాధారణ స్థితికి తీసుకురావొచ్చని ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అన్నారు. ప్రస్తుత జీవనశైలి, రకరకాల ఒత్తిడుల కారణంగా మానసిక రుగ్మతలు వస్తున్నాయని, అమెరికా వంటి దేశాల్లో మరిన్ని ఎక్కువ కేసులు వస్తుంటాయని చెప్పారు. పట్టణానికి చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ చదలవాడ కృష్ణయ్య చౌదరి స్మారక బంగారు పతకాన్ని ఆయన వర్ధంతి రోజైన శనివారం రాత్రి డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడికి ప్రదానం చేశారు. స్థానిక బోసురోడ్డులోని శ్యామల రత్నమ్మ, డాక్టర్ మేజర్ వృక్షక్కి మెమోరియల్ హాలులో ఏర్పాటైన వైద్యుల సమావేశానికి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. బంగారు పతక గ్రహీత డాక్టర్ బాబు, 'మానసిక సమస్యలు–ఆధునిక చికిత్స' అంశంపై డాక్టర్ చదలవాడ కృష్ణయ్య స్మారకోపన్యాసం చేశారు. అమెరికా వెళ్లినపుడు సరికొత్త వైద్యవిధానం, సాంకేతికతను నేర్చుకుని, అరుదైన సైకియాట్రీ విభాగంలో పని చేస్తున్నట్లు తెలిపారు. కోర్టుల్లో క్లిష్టమైన కేసుల పరిష్కారంలో తాను సహకరించగలిగానని చెప్పారు. డాక్టర్ కె అనిల్ కుమార్ తన ప్రసంగంలో చదలవాడ కృష్ణయ్య చౌదరి గుర్తింపు పొందిన సర్జన్‌గా చెబుతూ, కోస్తా ఆంధ్రలో 50 పడకల నర్సింగ్ హోమ్‌ను స్థాపించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో నాలుగు తరాల కుటుంబ సభ్యులంతా వైద్యవృత్తిలో సేవల నందిస్తున్నామని చెప్పారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.మధుప్రభాకర్ మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్, మత్తు వంటి సదుపాయాలు లేనిరోజుల్లో సమర్థంగా సర్జరీలు చేసి, వైద్యవిద్యార్థులకు స్ఫూర్తినిచ్చారని చెప్పారు. ఉపాధ్యక్షురాలు డాక్టర్ పావని ప్రియాంక, సంయుక్త కార్యదర్శి డాక్టర్ చందు ఉదయ, కోశాధికారి డాక్టర్ శ్యాంప్రసాద్, సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, విశ్వమోహన్‌రావు, ఉమామహేశ్వరరావు, భానుప్రసాద్, పి.సోమశేఖర్, జేవీ సుబ్బారావు, మాధవి, సరోజిని, నీలిమ, డాక్టర్ కృష్ణయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ మూట్ కోర్టు పోటీల విజేత తిరువనంతపురం



తిరువనంతపురం న్యాయ కళాశాల బృందానికి బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని జేసీ లా కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన నాలుగవ జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన తిరువనంతపురం ప్రభుత్వ న్యాయ కళాశాల, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి బృందాలకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.గోపీచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇస్కాన్ మందిర వార్షికోత్సవం



రాధా శ్యామసుందరులకు ప్రత్యేక పూజలు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట మార్గంలోని ఇస్కార్ మందిర 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మందిర అధ్యక్షులు చక్రధారి మాట్లాడుతూ శ్రీశ్రీ రాధాశ్యామసుందరుల స్వామికి తెల్లవారుజాము నుంచి మంగళ హారతి, ధూప దీప నైవేద్యాది కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు. మధ్యాహ్నం వెయ్యి కిలోల పుష్పాలతో అంగరంగ వైభవంగా పుష్పాభిషేకం చేసినట్లు చెప్పారు. స్వామి కీర్తనలు, భజనలు, హారతుల అనంతరం అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసిందని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందిర సహ అధ్యక్షులు ముకుంద మాధవ్ దాస్, వేణుధారి కృష్ణదాస్, మురళీ మోహన్‌దాస్ పాల్గొన్నారు.

తైక్వాండోలో విజ్ఞాన్ విద్యార్థినికి బంగారు పతకం



పతకాన్ని అందుకుంటున్న కళా జ్యోత్స్న

లక్ష్మీపురం: జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కళా జ్యోత్స్న బంగారు పతకాన్ని సాధించింది. ఈ మేరకు యూనివర్సిటీ కోచ్ ఖాదర్ బాషా ఆదివారం తెలిపారు. తెలంగాణలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జనవరి 28,29,30 తేదీల్లో పోటీలు జరిగినట్లు చెప్పారు. కఠోరమైన శిక్షణ పొంది జాతీయస్థాయిలో బంగారు పతకం దక్కించుకున్న కళా జ్యోత్స్నకు అభినందనలు తెలిపారు. తైక్వాండో పోటీల ఇండియా అధ్యక్షుడు ఫైరోజ్ అహ్మద్, సెక్రటరీ ప్రభ శర్మ, ట్రెజరర్ అచ్యుత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ నాయబ్ రసూల్, సీనియర్ కోచ్‌లు బాషా మాస్టర్, సలీం మాస్టర్‌ల చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు.

సందడిగా కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు





బహుమతులు అందుకుంటున్న ఈతగాళ్లు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహనరావు పాల్గొన్నారు. జెండా ఊపి స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 10 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాలు పైబడిన వారు కూడా ఈ పోటీలలో పాల్గొనడం వారి ఆత్మ విశ్వాసాన్ని తెలియజేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సహకారంతో ఈతగాళ్ల రక్షణ కోసం స్పీడు బోట్లు, ముప్పై నాటు పడవలపై రెస్క్యూ ఎక్విప్‌మెంట్, ప్రతి పడవలో సీనియర్ స్విమ్మర్స్‌ను ఏర్పాటు చేసిన ఆక్వా డెవిల్స్ వారిని అభినందించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు అమరావతి ఫెస్టివల్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కొమ్మినేని పట్టాభిరామయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు పాతూరి నాగభూషణం బహుమతులు అందజేశారు. పాల్గొన్న స్విమ్మర్స్‌కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ దాసరి యుగంధర్, అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ మందపాటి నరసరాజు,వైస్ ప్రెసిడెంట్ లింగపిల్లి రామకృష్ణ, వెంకటరెడ్డి, రామచంద్రరావు, యార్లగడ్డ రమేష్ పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ మహిళా హాకీ జట్టు ఎంపిక



జట్టుతో హాకీ కార్యదర్శి అజయ్‌బాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం గుంటూరు జిల్లా సీనియర్ మహిళా హాకీ జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. హిందూ కాలేజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. ఈ జట్టు ఈనెల 8, 9, 10వ తేదీల్లో నెల్లూరులో జరగనున్న 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఉమెన్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనన్నుట్లు హాకీ గుంటూరు కార్యదర్శి ఎం. అజయ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

శాప్ ఎండీ గిరీష

మంగళగిరి (తాడేపల్లిరూరల్): క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని శాప్ ఎండీ గిరీష అన్నారు. మంగళగిరి పరిధిలోని 6వ ఏపీఎస్‌పీ బెటాలియన్ మైదానంలో ఆదివారం 7వ పారా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, వైస్ చైర్మన్ గిరీష మాట్లాడుతూ పారా క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు, వారిలో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పారా క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. వాటిని ఉపయోగించుకుని జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సూచించారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ షార్ట్‌పుట్, పరుగు, జావలిన్ త్రో, డిస్క్ త్రో, లాంగ్‌జంప్ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 500 మంది పాల్గొన్నారని తెలిపారు. వివిధ విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 17 నుంచి 20వరకు చెన్నైలో జరగపోయే జాతీయ పారా క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ ఆఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, ట్రిన్ ట్రస్ట్ సంస్థ నేషనల్ హెడ్ ప్రియారంజన్ బీదర్, పారా స్పోర్ట్స్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీకృష్ణ చైతన్య, గుంటూరు పారా స్పోర్ట్స్ అధ్యక్షులు ఎల్లయ్యతో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాహిత్య ఉద్యమాలు



యువకిశోరం భగత్‌సింగ్ 'రంగ్ దే బసంతి' నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

గుంటూరు ఎడ్యుకేషన్: సామ్రాజ్యవాద, ప్రపంచీకరణలకు వ్యతిరేకంగా జాతీయ వాద సాహిత్య, సాంస్కృతిక, కళా ఉద్యమాలను నిర్మిస్తామని ఆల్ ఇండియా పీపుల్స్ లిటరరీ ఆర్ట్ అండ్ కల్చరల్ ఫోరం (ఏఐపీఎల్‌సీఎఫ్) జాతీయ అధ్యక్షుడు గౌతమ్ ముఖర్జీ పేర్కొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో మూడురోజుల పాటు నిర్వహించిన అఖిల భారత ప్రజా సాహిత్య, సాంస్కృతిక సభలు ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతమ్ ముఖర్జీ మాట్లాడారు. పాలక పార్టీలు ప్రజలను కుల, మత, ప్రాంత, భాషల ప్రాతిపదికన చీలుస్తున్నాయన్నారు. అభివృద్ధి, నాగరికత పేరుతో అన్ని రకాలుగా విష సంస్కృతిని వ్యాప్తి చేస్తున్నట్లు చెప్పారు. పాలక పార్టీల విధానాలకు వ్యతిరేకంగా వివిధ రాష్ట్రాల నుంచి రచయితలు, కళాకారులు చిత్ర ప్రదర్శనలు, పాటలు, లఘు నాటికలు, రూపకాల ద్వారా పెద్దఎత్తున పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేశారని వివరించారు. మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. సాహిత్యం కళలు, సామాజిక, సమానత్వం కోసం సాగే అన్ని ఉద్యమాలకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. దేశంలోని అన్ని భాషల రక్షణ, అభివృద్ధిని డిమాండ్ చేస్తూ సభలో తీర్మానం చేశారు. ఆయా వర్గాలపై జరుగుతున్న దాడులను కళాకారులు నాటికల ద్వారా కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు, ఉపాధ్యక్షుడు దివి కుమార్, కోశాధికారి డాక్టర్ భట్టు రమణ ప్రసాద్, జన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రభుత్వ విద్యా రంగం

యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి



మాట్లాడుతున్న కుసుమకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందని, దీన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్. కుసుమకుమారి పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారంజరిగిన విస్తృత కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. సంస్కరణల ముసుగులో తరగతుల తరలింపు తగదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులు ఉండాల్సి ఉండగా, 3,4,5 తరగతులను విడదీయాలని ఏ ఒక్క కమిషన్, విద్యావేత్త చెప్పలేదని తెలిపారు. శాసనమండలితో పాటు సమాజంలోనూ విద్యారంగం బలోపేతానికి పాటుపడే పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం కనీసం పీఆర్సీ కమిటీని సైతం వేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం ఉద్యోగులపై నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, గోవిందయ్య, రంగారావు, ప్రసాద్, కేదార్‌నాథ్, ఏ.శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు



కోటేశ్వరరావు మృతదేహం



గాయపడిన శ్రీనివాస్

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ అండర్‌పాస్ సమీపంలో గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే సర్వీస్ రోడ్‌లో ఆదివారం రాత్రి ప్రమాదం జరిగింది. ఓ టిప్పర్ స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరిని ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి భార్గవ పేటకు చెందిన జొన్నాదుల శ్రీనివాస్, కేసనం కోటేశ్వరరావు (42) స్నేహితులు. చినకాకానిలోని బంధువుల ఇళ్ల దగ్గర పాలు తీసుకోవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ అండర్‌పాస్ వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. మృతి చెందిన కేసనం కోటేశ్వరరావు బంగారుపు పని చేస్తాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. కోటేశ్వరరావుకు భార్యతో పాటు 10వ తరగతి చదివే కుమార్తె ఉంది. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మట్టి లోడ్‌తో వెళుతున్న టిప్పర్ డ్రైవర్ లారీతో సహా పరారీ కావడంతో స్థానికులు వెంబడించి పోలీసులకు అప్పగించారు.

ఏబీసీ కెనాలో మృతదేహం లభ్యం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మృతదేహం లభ్యమైంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన మండ్ల రాజేష్ (25) పదేళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో వినుకొండ పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై ఒంటరిగానే జీవనంగా కొనసాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు, సహచర కూలీలు తెలిపారు. ఈ క్రమంలో అనూహ్యంగా కాల్వలో మృతదేహమై దొరికాడు. విషయాన్ని మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఆయన తెలిపారు.

వీణ విద్వాంసుడు ఫణి నారాయణకు పురస్కార ప్రదానం



ఫణి నారాయణతో జస్టిస్ దుర్గాప్రసాదరావు, వీణ విద్వాంసులు, నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని పద్మావతి కల్యాణ వేదికపై రామరాజు ఫౌండేషన్, రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్‌ల నిర్వహణలో వాణీ ఝురి కార్యక్రమాన్ని నిర్వహించారు. రామరాజు శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. తొలుత ఆర్.లక్ష్మీశ్రీనివాస్ వీణ కచేరీతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఏ.భారతీదేవి, బి. వంశీకృష్ణ, అయ్యగారి సత్యప్రసాద్, కె. శశిధర్, కె.హేమలక్ష్మి, ఎస్వీఎస్ కేఎస్.గోవిందరాజన్, బి.మధు రిమల వీణ కచేరీలు శ్రావ్యంగా జరిగాయి. వీరికి మృదంగంపై బి.సురేష్ బాబు, బి. శ్రీరామ్, కె.అరవింద్, ఎం.హరి బాబు, కె.అనిల్‌కుమార్, ఆర్.బాలాదినకర్ చక్కటి వాయిద్య సహకారం అందించారు. ప్రధాన కచేరీలో భాగంగా ప్రముఖ వీణ విద్వాంసులు ఫణినారాయణ కచేరీ నిర్వహించారు. వీరికి మృదంగంపై ఎస్.రఘునందన్, హైదరాబాద్ ఘటంపై హరిబాబు వాయిద్య సహకారం అందించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రామరాజు శ్రీనివాస్ దంపతులతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్యలు ఫణి నారాయణను ఈమని శంకరశాస్త్రి స్మారక పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫణి నారాయణ మాట్లాడుతూ విశేషమైన వసంత పంచమి రోజు వైణిక కార్యక్రమాలను నిర్వహించి, సత్కరిస్తున్న సంస్థ వారిని అభినందించారు.